# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 15 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 08

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా



## బ్రిక్స్ సదస్సుకు హైదరాబాద్ వేదిక

### మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో మంగళవారం ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్--2026 ఘనంగా ప్రారంభమైంది. జూలై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సును కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా ప్రారంభించారు.

- హైదరాబాద్, జూలై 14



### విద్యుత్ మౌలిక వసతులకు

## ఊతం

భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు

జూపల్లి, వాకిటి శ్రీహరి పాల్గొన్న కార్యక్రమం

రూ.376.25 కోట్ల విద్యుత్ పనులకు శ్రీకారం

గద్వాల, జూలై 14 : రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం పెద్దఎత్తున విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ (మిగతా 2వ పేజీలో)



### 2,144 మందికి

## ఉత్తర్వులు

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్

వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్

చెన్నై, జూలై 14

తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన వైద్యారోగ్య శాఖ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో హృదయాన్ని హత్తుకునే సంఘటన చోటుచేసుకుంది. (మిగతా 2వ పేజీలో)



2

### సింగరేణికి కేంద్రం

## భరోసా

కిషన్ రెడ్డి యాత్ర కొనసాగింపు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి విమర్శలు



2

### గోదావరి-నల్లమలసాగర్‌పై

## నిర్లక్ష్యం బట్టబయలు

కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్ఠంగా వ్యాజ్యం

సీఎంకు తెలంగాణ నీటి వాటాలపై శ్రద్ధ లేదు: హరీశ్‌రావు ఆరోపణ





2

## రైల్వేల్లో మరో 8 సంస్కరణలు

అశ్విని వైష్ణవ్ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ఆవిష్కరణ

వ్యయం తగ్గింపే లక్ష్యమన్న కేంద్ర మంత్రి



## వివక్ష లేకుండా కేంద్రం నిధులు

### ఎంపీ ఈటల రాజేందర్

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం వివక్ష లేకుండా నిధులు మంజూరు చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాల పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్‌లో ఎంపీల తో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర భాజపా ఆదేశాల మేరకు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈటల పలు అంశాలపై మాట్లాడుతూ.. "రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపడం లేదు.



### ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

# బిజీబిజీ

**కేంద్రమంత్రులు గడ్కరీ, రామ్మోహన్ నాయుడులతో కీలక భేటీలు**

రీజనల్ రింగ్ రోడ్డు (RRR) అనుమతులు, విమానాశ్రయాల అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారం మరవలేనిదన్న ముఖ్యమంత్రి

జూన్ 2, 2028 నాటికి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పూర్తికి కేంద్రం హామీ

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను ద అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రెండు విమానాశ్రయాల నిర్మాణం, ఆధునిక సౌకర్యాలు, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి వరంగల్ విమానాశ్రయం కీలకంగా మారుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు ఇది ప్రధాన రవాణా కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే రైలు, రహదారి మార్గాలతో అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా వస్త్ర పార్కు, కాజీపేట రైల్వే కోచ్ కర్మాగారం, ఇతర పరిశ్రమల అభివృద్ధికి కూడా ఈ విమానాశ్రయం దోహదపడుతుందని చెప్పారు. - న్యూఢిల్లీ, జూలై 14

2



## జీహెచ్‌ఎంసీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ నోటీసులపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఈనెల 7న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ ప్రాథమికంగా నిర్ధరించలేదని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ పిటిషన్‌లో పేర్కొంది. ఎలాంటి చర్యలు చేపట్టకుండా జీహెచ్‌ఎంసీని ఆదేశించాలని హైకోర్టును కోరింది.

## అబ్బే.. హర్మూజ్‌లో టోల్ లేదు



దుబాయ్, వాషింగ్టన్: హర్మూజ్‌లో టోల్ వసూలు ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్క రోజులోనే వెనక్కి తగ్గారు. టోల్‌కు బదులు.. పశ్చిమాసియా దేశాలు తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాయని, తమ దేశంలో భారీగా పెట్టుబడులు పెడతాయని మంగళవారం తెలిపారు. పశ్చిమాసియా నాయకత్వంతో చర్చల అనంతరం ఈ మేరకు హర్మూజ్‌లో రుసుముల విధింపు నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. హర్మూజ్‌లో నౌకలకు అమెరికా రక్షణ కల్పిస్తుందని, అందుకుగాను వాటిలోని సరకు విలువలో 20% టోల్ వసూలు చేస్తుందని ట్రంప్ సోమవారం సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.

**కొనసాగిన దాడులు**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పూర్తిస్థాయి యుద్ధరూపం దాల్చే ముప్పు కనిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా మంగళవారం కూడా వైమానిక దాడులతో విరుచుకుపడింది. ప్రధానంగా ఆ దేశంలోని తీర రక్షక వ్యవస్థలు, క్షిపణి/డ్రోన్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. ప్రతిగా పశ్చిమాసియాలోని అగ్రరాజ్య మిత్రదేశాలైన బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లపై టెహ్రాన్ దాడులు చేసింది. ఇరాన్ నుంచి దూసుకొచ్చిన నాలుగు క్షిపణులను తాము అడ్డుకున్నట్లు జోర్డాన్ సైన్యం తెలిపింది.



## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి

**టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్. సీఎస్ కు వినతిపత్రం అందజేసిన నేతలు.**

వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలనీ టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టి పి టి ఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, నూతన ఆరోగ్య పథకం మార్గదర్శకాలను రూపొందించిఉద్యోగులకు వెంటనే హెల్త్ కార్డుల ను విడుదల చేయాలని, పిఆర్సి నీ ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని , ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ ను రూపొందించాలని , మోడల్ స్కూల్,గురుకుల, కేజీబీవీ లను విద్యాశాఖలో విలీనం చేసి, టీచర్లకు నూతన ఆరోగ్య పథకం వర్తింపజేయాలని, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పండిట్ పీఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని, అన్ని యాజమాన్యాల లో ఉన్న ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యం. లక్ష్మయ్య యాదవ్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య లు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై
## ఐక్య ఉద్యమం

**- యుయస్పీసి స్టీరింగ్ కమిటీ నిర్ణయం.**



వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు మరియు విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలసి ఐక్య పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పీసి) స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది.యుయస్పీసి స్టీరింగ్ కమిటీ సమావేశం మంగళవారం టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో టిటిఎ అధ్యక్షుడు ఎస్ హరికృష్ణ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25 ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, పిఒ 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని సమావేశం విమర్శించింది. టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, సబ్జెక్టు వారీ పేపర్లతో స్పెషల్ టెట్ నిర్వహించాలని, బిసి, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (డిఎ) ను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో యుయస్పీసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్) సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి( టిపిటిఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), వై విజయకుమార్, ఎం సైదులు (ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), బి కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), లక్ష్మణ్(టిటిఎ), రవీందర్, లక్ష్మయ్య యాదవ్(టిపిటిఎఫ్) పాల్గొన్నారు.

## కర్నూలులో హైవేపై జాగింగ్ చేస్తుండగా దుర్ఘటన

**గుర్తు తెలియని వాహనం ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి**

కర్నూలు: జిల్లాలోని బళ్లారి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి(43) అక్కడికక్కడే మృతి చెందారు. మంగళవారం ఉదయం హైవేపై జాగింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. వాహనం ఢీకొట్టడంతో హెడ్ కానిస్టేబుల్.. వంతెన పైనుంచి కిందపడిపోయి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ వర ప్రసాద్ రెడ్డి మృతి చెందడంపై హోం మంత్రి అనిత స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ మృతి తీవ్ర విచారకరమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించిన ఒక పోలీసు సిబ్బందిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

# ఢిల్లీ పర్యటనలో రేవంత్ రెడ్డి బిజీబిజీ

న్యూఢిల్లీ, జూలై 14

వరంగల్ విమానాశ్రయంలో విమానాల మరమ్మతు కేంద్రం, సరుకు రవాణా కేంద్రం, విమాన నిల్వ కేంద్రం వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. భూసేకరణ ఇప్పటికే పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. 2028 జూన్ 2 నాటికి విమానాశ్రయ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. విమానాశ్రయ రూపకల్పనలో కాకతీయ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేక నమూనాలు ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. వరంగల్ చారిత్రక వైభవానికి తగ్గట్టుగా విమానాశ్రయ నిర్మాణం చేపట్టేందుకు కేంద్రం సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని విమానాశ్రయంతో పాటు పౌర విమానాశ్రయం కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రెండు విమానాశ్రయాలకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని స్పష్టం చేశారు. వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్‌లో కూడా విమానాల మరమ్మతు కేంద్రం, సరుకు రవాణా కేంద్రం, విమాన నిల్వ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు రెండు చోట్ల విమాన శిక్షణ సంస్థలను నెలకొల్పాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సముద్ర విమానాల సేవలను ప్రారంభించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించగా, దీనిపై అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయాల కోసం అత్యంత వేగంగా భూసేకరణ పూర్తి చేయడం అభినందనీయమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. వరంగల్ విమానాశ్రయం కాకతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచేలా నిర్మాణం చేపడతామని ఆయన వెల్లడించారు.

# విద్యుత్ మౌలిక వసతులకు ఊతం

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో రూ.376.25 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్ హెలిప్యాడ్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జులేకల్ గ్రామానికి చేరుకుని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ.155 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేసి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బహిరంగ సభలో మాట్లాడిన భట్టి విక్రమార్క, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేసేందుకు ఆధునిక ఉపకేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ విద్యుత్ రంగ బలోపేతంతో గ్రామీణాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. జిల్లాలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులు రైతులు, ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ధ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ..పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)



తప్పకుండా దవాఖానలను సందర్శించి వైద్య సేవలు, మౌలిక వసతులు, రోగుల సంఖ్య పెంపునకు అవసరమైన చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. బస్తీ దవాఖానల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు, పరీక్షలు, ఇతర సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానలను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన వైద్య కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన చర్యలను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో సమన్వయం చేసుకుని అమలు చేస్తామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# రైల్వేల్లో మరో 8 సంస్కరణలు

**అశ్విని వైష్ణవ్ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ఆవిష్కరణ**

**రవాణా వ్యయం తగ్గింపే లక్ష్యమన్న కేంద్ర మంత్రి**

న్యూఢిల్లీ, జూలై 14

భారత రైల్వే వ్యవస్థను మరింత సమర్థవంతంగా, ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' కింద మరో ఎనిమిది కీలక నిర్మాణాత్మక సంస్కరణలను మంగళవారం ప్రకటించారు. రైల్వే రంగంలో సామర్థ్యాన్ని పెంచడం, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సంస్కరణల ద్వారా సరకు రవాణా వ్యయాన్ని తగ్గించడం, సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం, పర్యావరణహిత సరకు రవాణాను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రైల్వే రంగాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రాజెక్టుల అమలులో జాప్యాన్ని తగ్గించి వేగవంతంగా పూర్తి చేయడానికి, రైల్వే వ్యవస్థలో సాంకేతిక ఆవిష్కరణలకు మరింత అవకాశాలు కల్పించడానికి ఈ విధానాలు దోహదపడతాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వే సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు ఈ సంస్కరణలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ చేపట్టిన '52 వారాల్లో 52 సంస్కరణలు' లక్ష్య కార్యక్రమంలో భాగంగానే ఈ ఎనిమిది కొత్త సంస్కరణలను అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రైల్వే వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, నవీనతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి రైల్వే రంగం కీలకమైనదని, రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా పరిశ్రమలు, వాణిజ్యం, సరకు రవాణాకు కొత్త ఊతం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ సంస్కరణలు భారత రైల్వేలను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు చేరువ చేసే దిశగా కీలక అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# గోదావరి-నల్లమలసాగర్‌పై నిర్లక్ష్యం బట్టబయలు

## మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి, జూలై 14

గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్‌పై భారాస మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉందని, తమ పార్టీ నిలదీయడంతోనే ప్రభుత్వం పాత తేదీలతో లేఖలు రాసిందన్నారు. సుప్రీం కోర్టులో తాజాగా గోదావరి-నల్లమలసాగర్‌పై తీర్పు వచ్చిందని, వ్యాజ్యం సరిగా ఫైల్ చేయలేదని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం మొట్టికాయలు వేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో, అంతకు ముందు ఖేడ్‌లో సర్, భారాస సభ్యత్వ నమోదుపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 'కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్టంగా దావా వేశారు. ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన దావా వేయడం సాధ్యం కాదు. కోర్టులో వాదనల కంటే ముందే ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించాల్సి ఉన్నా ఎందుకు పట్టించుకోలేదు? భారాసను తిట్టడంపై ఉన్న శ్రద్ధ తెలంగాణ నీటి వాటాల రక్షణపై లేదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు జలద్రోహి కూడా. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఏపీ అక్రమ ప్రాజెక్టులపై భారాస ప్రభుత్వ హయాంలో ఎన్నో స్టేలు తెచ్చాం. కాంగ్రెస్ మాత్రం ఏపీకి పరోక్షంగా సహకరిస్తూ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది. ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పంపకాల కమిటీ సలహాదారుగా నియమించారు. తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఆదిత్యనాథ్. కర్ణాటకలో ముగ్గురు సీఎంల సమావేశంలో ఏం చర్చించారో ప్రజలకు చెప్పాలి. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారు.

# 2,144 మందికి ఉత్తర్వులు

(మొదటి పేజీ తరువాయి)

నియామక పత్రం అందుకునేందుకు వేదికపైకి వచ్చిన ఓ జూనియర్ వైద్యుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌ను చూసి భావోద్వేగానికి గురయ్యాడు. "మిమ్మల్ని ఒక్కసారి కౌగిలించుకోవచ్చా?" అని అడగగా, ముఖ్యమంత్రి చిరునవ్వుతో అంగీకరించారు. ముఖ్యమంత్రి అనుమతి ఇవ్వడంతో ఆ యువ వైద్యుడు ఆనందంగా ఆయనను కౌగిలించుకుని తన నియామక పత్రాన్ని స్వీకరించాడు. ఈ దృశ్యాన్ని అక్కడ ఉన్నవారు చప్పట్లతో అభినందించగా, కార్యక్రమంలో పాల్గొన్న పలువురు చిత్రీకరించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళనాడు వైద్యారోగ్య శాఖలో కొత్తగా ఎంపికైన మొత్తం 2,144 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరిలో 751 మంది సహాయ వైద్య అధికారులు, 1,393 మంది ఆరోగ్య పరిశీలకులు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి స్వయంగా నియామక పత్రాలు అందించి అభినందించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత జోసెఫ్ విజయ్ ప్రజలకు మరింత చేరువయ్యేలా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో కూడా అభ్యర్థులు, ప్రజలతో ఆప్యాయంగా మెలగడం ఆయన ప్రత్యేకతగా మారింది. గతంలో కూడా ఓ గర్భిణి అభ్యర్థి వేదికపైకి రావడానికి ఇబ్బంది పడుతుండగా, ముఖ్యమంత్రి స్వయంగా వేదిక దిగివెళ్లి ఆమెకు నియామక పత్రం అందించి ప్రశంసలు పొందారు. తాజా ఘటనతో మరోసారి ఆయన మానవీయ కోణం వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ సాదాసీదాగా, ఆప్యాయంగా వ్యవహరించడం పట్ల అభిమానులు, ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ వైద్యుడు ముఖ్యమంత్రిని కౌగిలించుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది.

## సింగరేణికి కేంద్రం భరోసా

**కిషన్ రెడ్డి భరోసా యాత్ర కొనసాగింపు**


**బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి విమర్శలు**

గోదావరిఖని, జూలై 14 : సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర రెండో రోజు రామగుండం, గోదావరిఖనిలో కొనసాగింది. యాత్రకు సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కిషన్ రెడ్డి, సింగరేణి సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి, కార్మికుల భవిష్యత్తు మరింత భద్రంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సంస్థకు దీర్ఘకాలికంగా బొగ్గు నిల్వలు అందుబాటులోకి వస్తాయని, ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ విధానమని కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, భద్రత, సంస్థ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను కేంద్రం తీసుకుంటోందని స్పష్టం చేశారు. కార్మికుల శ్రమే దేశ పారిశ్రామికాభివృద్ధికి బలమని కొనియాడారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను బలోపేతం చేయకుండా ఆదాయ వనరుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు.

## బ్రిక్స్‌కు హైదరాబాద్ వేదిక

హైదరాబాద్, జూలై 14

ప్రపంచ కార్మిక రంగంలో మారుతున్న పరిస్థితులు, కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక అంశాలపై బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించనున్నారు. పరస్పర అనుభవా లను పంచుకుంటూ ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేయనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతమైతే కార్మికుల సంక్షేమానికి కొత్త అవకా శాలు ఏర్పడతాయని అన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ హైదరా బాద్‌కు ఇలాంటి అంతర్జాతీయ సదస్సు ఆతిథ్యం దక్కడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులు, పరిశ్రమ లు, ఉపాధి కల్పనతో పాటు కార్మిక సంక్షేమానికి అత్యంత ప్రాధా న్యం ఇస్తోందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో బ్రిక్స్ దేశాలకు చెందిన ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కార్మిక రంగ నిపుణులు పాల్గొని వివిధ అంశాలపై చర్చలు జరపనున్నారు. కార్మిక హక్కులు, సుస్థిర ఉపాధి, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.




## 'కొరియన్ కనకరాజు' టీజర్‌కు

# ప్రభాస్ శ్రీకారం

**మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న వైవిధ్యభరిత చిత్రం 'కొరియన్ కనకరాజు'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రంలోని 'కిమ్‌చి కారం' టీజర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. సోమవారం సాయంత్రం 4.05 గంట లకు సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది.**

హైదరాబాద్, జూలై 13 :

'కొరియన్ కనకరాజు ప్రపంచాన్ని మీకు పరిచయం చేయడానికి రెబల్ స్టార్ ప్రభాస్ వస్తున్నారు' అంటూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ ద్వారా సినిమాలో వరుణ్ తేజ్ పాత్ర, ఆయన హావభావాలు, నటన శైలి ఎలా ఉండబోతుందో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు సమాచారం. 'భారత--కొరియా వినోదం' అనే భావనతో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఈ చిత్రానికి గాంధీ మేర్లపాక దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి వ్యవహరిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామిగా ఉండటంతో ప్రభాస్ ఈ టీజర్‌ను విడుదల చేయడానికి ముందుకు వచ్చినట్లు సినీ వర్గాల్లో



## ఒక్క రాత్రిలో తొమ్మిది సినిమాలు కోల్పోయా

ముంబై, జూలై 13 :

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన విద్యా బాలన్ తన సినీ జీవిత ప్రారంభంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. ఒక సినిమా ఆగిపోవడంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేసి, ఒక్క రాత్రిలోనే తొమ్మిది చిత్రాల నుంచి తొలగించారని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన విద్యా బాలన్, తన సినీ ప్రయాణం ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సరసన 'చక్రం' చిత్రంలో నటించే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. అయితే చిత్రీకరణ ప్రారంభమైన కొద్ది రోజులకే అనివార్య కారణాలతో ఆ సినిమా నిలిచిపోయిందని చెప్పారు.

ఆ సినిమా ఆగిపోవడానికి తానే కారణమని కొందరు ప్రచారం చేశారని, దీంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేశారని విద్యా బాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రచారం కారణంగా ఒక్క రాత్రిలోనే తొమ్మిది సినిమాల నుంచి తనను తొలగించారని తెలిపారు. ఆ సమయంలో తాను తీవ్ర మానసిక వేదన అనుభవించినట్లు చెప్పారు.

అయితే వాస్తవానికి సినిమా ఆగిపోవడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, దర్శకుడు, మోహన్‌లాల్ మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాల వల్లే ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని విద్యా బాలన్ స్పష్టం చేశారు.

## 'అక్కినేని కుటుంబంలో బెస్ట్ యాక్టర్ అఖిలే'

హైదరాబాద్, జూలై 13 :

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తుండగా, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సినిమా చూసిన అనంతరం అఖిల్ నటనపై ప్రశంసల వర్షం కురిపించిన ఆయన, అక్కినేని కుటుంబంలోనే అఖిల్ అత్యుత్తమ నటుడని వ్యాఖ్యానించారు. 'లెనిన్' విడుదలైన వెంటనే అఖిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ రామ్ గోపాల్ వర్మ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. దీనికి స్పందించిన అఖిల్, "ధన్యవాదాలు సార్.. దయచేసి సినిమా చూడండి" అంటూ మర్యాదపూర్వ కంగా స్పంది




ంచాడు. ఈ సంభాషణ అభిమానులను ఆకట్టుకోగా, సినిమా చూసిన తర్వాత ఆర్జీవీ చేసిన తాజా వ్యాఖ్యలు మరింత వైరల్‌గా మారాయి. సినిమా వీక్షించిన అనంతరం రామ్ గోపాల్ వర్మ తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ, "ఇప్పుడే 'లెనిన్' చూశాను. సినిమా అద్భుతంగా ఉంది. ముఖ్యంగా అఖిల్ నటన ఎంతో ఆకట్టుకుంది. అక్కినేని కుటుంబ ంలోనే అతడే అత్యుత్తమ నటుడు అని ఇప్పుడు నమ్ముతున్నాను. ఇది నాగార్జున మీద ఒట్టు వేసి చెబుతున్నాను" అంటూ ప్రశంసించారు. సాధారణ సన్నివేశాల్లో కూడా అఖిల్ సహజమైన నటన కనబరిచాడని, భావోద్వేగ సన్నివేశాల్లో అతని అభినయం మరింత మెప్పించిందని ఆర్జీవీ పేర్కొన్నారు. నటుడిగా అఖిల్‌లోని పూర్తి సామర్థ్యాన్ని ఈ సినిమా బయటపెట్టిందని కొనియాడారు. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరిని కూడా ఆర్జీవీ ప్రత్యేకంగా అభినందించారు. అఖిల్‌కు ఇలాంటి బలమైన పాత్రను రూపొందించి, అతని నటనను కొత్త కోణంలో ప్రేక్షకులకు పరిచయం చేసినందుకు దర్శకుడిని ప్రశంసించారు.




## 'మా ఇంటి బంగారం' ఓటీటీలోకి

హైదరాబాద్, జూలై 13 :

థియేటర్లలో ఘన విజయాన్ని అందుకుని భారీ వసూళ్లు సాధించిన సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. కుటుంబ కథ, యాక్షన్, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రం సమంత కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తెలుగు హీరోయిన్లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందింది. దర్శకురాలు నందిని రెడ్డి, సమంత కాంబినేషన్‌లో వచ్చిన మూడో చిత్రం కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి.




## మూడు రోజుల్లో అఖిల్‌కు భారీ విజయం

హైదరాబాద్, జూలై 13 :

అక్కినేని అఖిల్ కెరీర్‌లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భారీ వాణిజ్య విజయం ఎట్టకేలకు 'లెనిన్' రూపంలో దక్కింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ పీరియాడిక్ గ్రామీణ ప్రతీకార కథా చిత్రం విడుదలైన తొలి ఆట నుంచే బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకెళ్తోంది. కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే నటించిన ఈ చిత్రంలో అఖిల్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి.

విడుదలైన మొదటి రోజే భారీ ప్రారంభ వసూళ్లు సాధించిన 'లెనిన్' రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది. అయితే మూడో రోజు మరింత ఎక్కువ వసూళ్లు నమోదు చేయడం సినీ వాణిజ్య వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ముఖ్యంగా టికెట్ ధరల్లో ఎలాంటి పెంపు లేకుండానే తొలి రెండు రోజుల కంటే అధిక వసూళ్లు సాధించడం సినిమాకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది. తాజా లెక్కల ప్రకారం, 'లెనిన్' ప్రపంచవ్యాప్తంగా కేవలం మూడు రోజుల్లోనే రూ.61.1 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించి అఖిల్ సినీ జీవితంలోనే అత్యంత భారీ విజయంగా నిలిచింది. విడుదలకు ముందు ఉన్న అంచనాలను మించి సినిమా ప్రదర్శన కొనసాగుతుండటంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. సినిమాలోని బలమైన కథ, గ్రామీణ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలు, యాక్షన్ ఘట్టాలు, అఖిల్ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మంచి నోటి మాట ప్రచారం కూడా చిత్ర విజయానికి ప్రధాన కారణంగా నిలిచిందని పేర్కొంటున్నారు. కుటుంబ ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో థియేటర్లకు వస్తుండటంతో వసూళ్లు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జునతో పాటు ప్రముఖ నిర్మాత నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు.

## సాయి పల్లవి వదులుకున్న చిత్రం ఇదేనా?



హైదరాబాద్, జూలై 13 :

లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి తన సహజ నటన, విభిన్న పాత్రల ఎంపికతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. గ్లామర్‌కు దూరంగా ఉంటూ కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఆమెకు సంబంధించిన ఓ ఆసక్తి కర వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'డియర్ కామ్రేడ్' చిత్రంలో తొలుత కథానాయికగా సాయి పల్లవినే ఎంపిక చేసినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో పెదవుల ముద్దు సన్నివేశాలు ఉండటంతో ఆమె ఆ చిత్రంలో నటించడానికి నిరాకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అనంతరం ఆ అవకాశం రష్మిక మందన్నకు వెళ్లినట్లు చెప్పుకుంటున్నారు. అయితే ఈ వార్తలపై చిత్రబృందం గానీ, సాయి పల్లవి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.